సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



ట్రా'ఫికర్'

హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారికి ఇరువైపులా ఇష్టారీతిన వాహనాల నిలుపుదలతో ఇక్కట్లు పెరిగాయి. 8లో ▸



మాట నిలుపుకోండి

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. 8లో ▸

16న శంకర్‌పల్లికి సీఎం?

శంకర్‌పల్లి: సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 16 లేదా 18న మున్సిపాలిటీలో పర్యటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మున్సిపాలిటీకి కేంద్రం అమృత్ 2.0 ద్వారా రూ.32 కోట్లు, గతంలో టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా రూ.21కోట్లు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు సీఎం రానున్నట్లు తెలిసింది.

న్యూస్‌రీల్

కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి



కేన్సర్ నిర్ధారణ శిబిరంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్, వైద్యులు

మొయినాబాద్: కేన్సర్ లక్షణాలున్నవారు తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్ సూచించారు. ఇండియన్ కేన్సర్ సొసైటీ సౌజన్యంతో మొయినాబాద్ పీహెచ్‌సీలో గురువారం కేన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 105 మంది హాజరై పరీక్షలు చేయించుకున్నారు. కేన్సర్ లక్షణాలున్న పది మందిని ఎంఎంజే కేన్సర్ హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. కేన్సర్ ప్రారంభదశలో ఉంటే మందుల ద్వారా తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ రాజేష్, డాక్టర్లు శ్రీనివాస్, స్వర్ణలత, అన్నపూర్ణ, సీహెచ్ఓలు సంతోష, వెంకట్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా చూడాలి



జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డికి మొక్క అందజేస్తున్న ఎంపీడీఓ తదితరులు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. వనమహోత్సవం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సంధ్య, మండల సూపరింటెండెంట్ రెహమాన్, సిబ్బంది కులశేఖర్, శ్రీకాంత్, రజిత తదితరులు పాల్గొన్నారు.

బస్సులు ఆపాలని నిరసన



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

శంకర్‌పల్లి: మోకిల శివారులో హైదరాబాద్ వైపు వెళ్లే రహదారిలో రిక్వెస్ట్ స్టాప్ ఉన్నప్పటికీ బస్సులు ఆపడం లేదని అపార్ట్‌మెంటు, విల్లాల్లోని ప్రజలు గురువారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై పూర్తిగా రాకపోకలు నిలిపివేయడంతో భారీగా వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు అక్కడికి చేరుకుని నిరసనకారులకు సర్ది జెప్పి పంపించారు. అనంతరం ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు. త్వరలోనే డీఎంని కలిసి తమ సమస్యను వివరిస్తామని అపార్ట్‌మెంటు, విల్లా వాసులు తెలిపారు.

ఎరువుల కొరత సృష్టించొద్దు

జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి



కేశంపేటలో ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసిన గీతారెడ్డి

కేశంపేట: ఫర్టిలైజర్ డీలర్లు స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా నమోదు చేయాలని, రైతులకు ఎరువుల కొరత సృష్టించొద్దని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో గురువారం మొక్కజొన్న, పత్తి పంటలను, ఇప్పలపల్లి, కేశంపేట గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి అధికంగా ఉందని, రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల సూచనలు, సలహాలు పాటించి మందులను పిచికారీ చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శిరీష, వ్యవసాయ విస్తరణ అధికారి లలిత పాల్గొన్నారు.

మహా ప్రక్షాళన

హెచ్ఎండీఏ ప్రణాళిక విభాగంలో మార్పులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహా నగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) ప్రణాళిక విభాగంలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. జోన్ల పరిధిని పెంచడంతో పాటు పూర్తి స్థాయిలో అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఏళ్లతరబడి ఒకేచోట పని చేస్తున్న వారికి స్థానచలనం కల్పించారు. అన్ని రకాల నిర్మాణ అనుమతులు, లే అవుట్‌లు, ఎల్ఆర్ఎస్‌లు, భవనాల ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ల వంటి వివిధ రకాల సేవలను అందజేయడంలో కీలకమైన ప్లానింగ్ విభాగంపై కొంతకాలంగా పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో జారీ చేసిన అడ్డగోలు అనుమతుల నేపథ్యంలో ఏసీబీ దాడులు సైతం జరిగాయి. అప్పట్లో డైరెక్టర్‌గా వ్యవహరించిన శివబాలకృష్ణ లక్ష్యంగా జరిగిన ఏసీబీ సోదాలు హెచ్ఎండీఏ ప్లానింగ్‌లో ప్రకంపనలు పుట్టించాయి. మరోవైపు పలువురు అధికారులపై ఆరోపణలు వచ్చాయి. దీంతో ప్లానింగ్ విభాగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరముందని అధికారులు అప్పుడే గుర్తించారు. ఇటీవల అన్ని ప్రభుత్వ విభాగాల్లో బదిలీలకు ప్రభుత్వం అనుమతినివ్వడంతో హెచ్ఎండీఏ ప్లానింగ్‌లో ప్రక్షాళనకు మార్గం సుగమమైంది. దీంతో ఆన్‌డిప్యుటేషన్‌పై హెచ్ఎండీఏ ప్లానింగ్‌లో విధులు నిర్వర్తించిన పలువురు అధికారులను మొదట బదిలీ చేశారు. తాజాగా అంతర్గత బదిలీలు చేపట్టారు. అన్ని జోన్‌లలోనూ అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరిగాయి.

కొత్తగా ఆరుగురు ప్రణాళిక అధికారులు

జోన్‌లను పెంచడంతో పాటు అన్ని జోన్‌లకు ప్లానింగ్ అధికారులను నియమించారు. వివిధ విభాగాల నుంచి బదిలీపై హెచ్ఎండీఏకు వచ్చిన వారితో పాటు ప్లానింగ్ విభాగంలోనూ పూర్తిస్థాయిలో అంతర్గత బదిలీలు చేపట్టారు. కొత్తగా ఏర్పాటైన మేడ్చల్ జోన్–1 ప్లానింగ్ అధికారిగా గోపికా రమ్య, మేడ్చల్–2 ప్లానింగ్ అధికారిగా కె.శాలిని బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు మేడ్చల్ చీఫ్ ప్లానింగ్ అధికారిగా పని చేసిన యశ్వంత్‌రావు ఘట్‌కేసర్‌కు బదిలీ అయ్యారు. శంకర్‌పల్లి జోన్ ప్లానింగ్ అధికారి యాదగిరిరావు మాస్టర్‌ప్లాన్ యూనిట్‌కు బదిలీ అయ్యారు. కొత్తగా ఏర్పడిన శంకర్‌పల్లి– 1కు చీఫ్ ప్లానింగ్ అధికారి బి.ప్రసాద్ రావు, శంకర్‌పల్లి జోన్–2కు సీపీఓ మల్లికార్జునరావు నియమితులయ్యారు. శంషాబాద్ జోన్ సీపీఓగా రవీందర్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. మాస్టర్ ప్లాన్ యూనిట్, గ్రిడ్‌రోడ్ డీమార్కేషన్‌కు సీపీఓగా సత్యనారాయణమూర్తి, మాస్టర్‌ప్లాన్ యూనిట్ సీపీఓగా రవీందర్‌రెడ్డి నియమితులయ్యారు. అలాగే వివిధ జోన్‌లలో సహాయ ప్లానింగ్ అధికారులుగా పని చేస్తున్న ఏపీఓలు సైతం బదిలీ అయ్యారు. కొందరు కొత్త జోన్‌లకు బదిలీ కాగా, మరికొందరు అదే జోన్‌లో ఇతర మండలాలకు బదిలీ అయ్యారు.

నాలుగు నుంచి ఆరుకు పెరిగిన జోన్లు

- మేడ్చల్, శంకర్‌పల్లి విభజన
- యథావిధిగా ఘట్‌కేసర్, శంషాబాద్ జోన్లు
- ప్లానింగ్, సహాయ ప్లానింగ్ అధికారుల బదిలీలు
- జోన్ల పెంపుతో సకాలంలో ఫైళ్ల పరిష్కారం

ఎల్ఆర్ఎస్‌పై సమీక్ష

లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ఫైళ్లను వేగిరం పరిష్కరించేందుకు ఒకటి రెండు రోజుల్లో హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ ప్లానింగ్ విభాగంతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నారు. కొత్తగా జోన్‌లను పెంచడంతో పాటు, సీపీఓలు, పీఓలు, ఏపీలు పూర్తిస్థాయిలో బదిలీ అయిన నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ ఫైళ్ల పరిధిపైనా కసరత్తు జరగనుంది. కొన్ని జోన్‌లు, మండలాల పరిధిలో వేల సంఖ్యలో ఫైళ్లు పెండింగ్‌లో ఉండగా మరికొన్ని జోన్‌లలో వందల్లో ఉన్నాయి. ఈ క్రమంలో కొందరు పనిభారంతో ఎక్కువ ఒత్తిడికి గురి అవుతుండగా, మరి కొందరు సత్వరమే తమ లక్ష్యాలను పూర్తి చేసుకుంటున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎల్ఆర్ఎస్ ఫైళ్లను జోన్‌లు, మండలాల మధ్య సమంగా పంపిణీ చేసి పరిష్కరించాలని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

జోన్ల విస్తరణ

ప్లానింగ్ జోన్లను పెంచారు. సుమారు 7,200 చదరపు కిలోమీటర్ల పరిధిలో హెచ్ఎండీఏ విస్తరించి ఉంది. ఇప్పటి వరకు ఉన్న శంకర్‌పల్లి, శంషాబాద్, ఘట్‌కేసర్, మేడ్చల్ నాలుగు జోన్‌లను ప్రస్తుతం 6 జోన్‌లుగా విస్తరించారు. మేడ్చల్ జోన్ విభజించి మేడ్చల్–1, మేడ్చల్–2గా రెండు జోన్‌లు చేశారు. శంకర్‌పల్లి జోన్ సైతం శంకర్‌పల్లి–1, శంకర్‌పల్లి–2 జోన్‌లుగా చేశారు. ఘట్‌కేసర్, శంషాబాద్ జోన్‌లు మాత్రం యథావిధిగా ఉన్నాయి. మేడ్చల్ జోన్–1 పరిధిలో బాచుపల్లి, గుండ్లపోచంపల్లి, నర్సాపూర్, శామీర్‌పేట్, శివంపేట్, తూప్రాన్, మనోహరాబాద్ తదితర ప్రాంతాలు, మేడ్చల్ జోన్–2 పరిధిలో కొంపల్లి, మేడ్చల్, పీఎఫ్‌యూ, గ్రిడ్‌రోడ్, ఉప్పల్ భగాయత్, దుండిగల్, గండిమైసమ్మ, మర్కూక్, ములుగు, వర్గల్, కాప్రా తదితర ప్రాంతాలు రానున్నాయి. శంకర్‌పల్లి జోన్–1 పరిధిలో గండిపేట్, రాజేంద్రనగర్, రామచంద్రాపురం, చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లి–2 పరిధిలో అమీన్‌పూర్, పటాన్‌చెరు, శంకర్‌పల్లి, సంగారెడ్డి, కంది, జిన్నారం, గుమ్మడిదల, హత్నూర తదితర ప్రాంతాలు ఉంటాయి. ఘట్‌కేసర్ జోన్‌లో ఘట్కేసర్, భువనగిరి, బొమ్మలరామారం, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, చౌటుప్పల్, పోచంపల్లి, బీబీనగర్, మేడిపల్లి, కీసర తదితర ప్రాంతాలు. శంషాబాద్ జోన్‌లో బాలాపూర్, ఇబ్రహీంపట్నం, యాచారం, కందుకూరు, మంచాల (పార్ట్), మహేశ్వరం, శంషాబాద్, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, కొత్తూరు, నందిగామ తదితర ప్రాంతాలు ఉంటాయి.

ఎల్ఆర్ఎస్ ఎప్పుడో!

- క్రమబద్ధీకరణకు అడుగడుగునా ఆటంకాలు
- క్షేత్రస్థాయిలో వేధిస్తున్న సిబ్బంది కొరత
- సాఫ్ట్‌వేర్‌లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు
- అధికారులకు సవాల్‌గా మారిన దరఖాస్తుల పరిశీలన



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అనధికారిక లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) ప్రక్రియకు సిబ్బంది కొరతకు తోడు సాంకేతిక సమస్యలు అవరోధంగా మారుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన పోర్టల్ తరచూ మొరాయిస్తోంది. క్షేత్రస్థాయి సిబ్బంది పోర్టల్ లాగిన్లై.. అన్ని వివరాలను నమోదు చేసి, తీరా సబ్‌మిట్ మీట నొక్కితే.. ఫీజు చెల్లింపులు, రసీదులు, ప్రొసీడింగ్స్ జారీ వంటి ప్రక్రియ పూర్తికాక పోగా, మళ్లీ మొదటికొస్తుండటంతో ఏం చేయాలో అర్థంకాక ఆయా పురపాలికల్లోని అధికారులు తల పట్టుకుంటున్నారు. ఇప్పటికే అక్రమ నిర్మాణాల గుర్తింపు, నియంత్రణ చర్యల్లో భాగంగా వాటి కూల్చివేతలు, కొత్త భవనాలకు అనుమతుల జారీ, ఇంటి పన్ను నిర్ధారణ, వసూళ్ల వంటి ప్రక్రియతో బిజీగా ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారులకు వేలల్లో పేరుకుపోయిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన సవాల్‌గా మారింది. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రధానంగా ఇదే సమస్య వేధిస్తోంది.

తరచూ మొరాయిస్తున్న సర్వర్

ఖాళీ ప్లాట్లు/ లే అవుట్ల క్రమబద్ధీకరణ కోసం గత ప్రభుత్వం 2020లో నోటిఫికేషన్ జారీ చేసింది. లే అవుట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుకు రూ.పది వేలు, ఖాళీ ప్లాట్ల క్రమబద్ధీకరణకు రూ.వేయి ఫీజుగా నిర్ణయించింది. ఈ మేరకు హెచ్ఎండీఏ పరిధిలోని నాలుగు జోన్లలో 3,58,464 దరఖాస్తులు రాగా, జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్ల పరిధి నుంచి అత్యధికంగా 2,28,143 దరఖాస్తులు అందాయి. ఇప్పటి వరకు 787 దరఖాస్తు లను మాత్రమే పరిష్కరించారు. మిగిలినవన్నీ పెండింగ్‌లోనే ఉండిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం ఈ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసింది. మూడు నెలల్లో వీటిని పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించింది. జిల్లాలోని ఏ ఒక్క మున్సిపాలిటీలోనూ ఆశించిన స్థాయిలో సిబ్బంది లేరు. ఇదిలా ఉంటే జిల్లా నుంచి అందిన దరఖాస్తుల్లో మెజార్టీ ప్లాట్లు, లే అవుట్లు నిషేధిత జాబితాలో ఉన్న భూములు, చెరువులు, కుంటలు, బఫర్‌జోన్లకు సమీపంలోనే ఉన్నాయి. దరఖాస్తుల పరిశీలనలో అధికారులు ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా భవిష్యత్తులో చిక్కులు తప్పవు. టౌన్‌ప్లానింగ్, నీటి పారుదల, రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్తే కానీ.. ఆయా దరఖాస్తులకు పరిష్కార మార్గం లభించని పరిస్థితి. అంతేకాదు 111జీఓ పరిధిలోని పురపాలక సంఘాలు, గ్రామాల నుంచి అందిన దరఖాస్తుల విషయంలోనూ తలనొప్పులు ఎదురయ్యే అవకాశం ఉంది.

జిల్లాలో అందిన దరఖాస్తులు ఇలా..

మున్సిపాలిటీ/కార్పొరేషన్	దరఖాస్తులు
తుర్కయంజాల్	49,759
బడంగ్‌పేట్	47,793
పెద్ద అంబర్‌పేట్	43,740
షాద్‌నగర్	16,450
ఆదిబట్ల	14,889
ఇబ్రహీంపట్నం	13,142
జల్‌పల్లి	10,892
బండ్లగూడ	7,240
శంషాబాద్	6,672
ఆమనగల్లు	3,447
నార్సింగి	3,354
శంకర్‌పల్లి	3,300
మీర్‌పేట్	3,087
కొత్తూరు	2,767
తుక్కుగూడ	2,544
మణికొండ	2,421

'అన్నపూర్తి'కి ఆమనగల్లు ఎంపిక



ఆమనగల్లులో పౌరసరఫరాల శాఖ గోదామును పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్నపూర్తి పథకం కింద ఆమనగల్లు పౌరసరఫరాల శాఖ గోదాము, ఆమనగల్లు మండలం ఎంపిక కానుంది. ఈ మేరకు మండలంలో గురువారం కేంద్రబృందం ప్రతినిధి శివం, పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ పర్యటించారు. చౌకధరల దుకాణం ద్వారా లైన్‌లో నిలబడి రేషన్ తీసుకునే పరిస్థితికి చెక్‌పెట్టి ఎప్పుడైనా రేషన్ తీసుకునేలా గ్రెయిన్‌ఏటీఎం చైన్‌తో ప్రజాపంపిణీ వ్యవస్థను ప్రభుత్వం అనుసంధానం చేయనుంది. ఈ మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న అన్నపూర్తి పథకానికి ఆమనగల్లు మండలం ఎంపికకానున్నట్లు చెప్పారు. పట్టణంలోని పౌరసరఫరాల శాఖ గోదామును సందర్శించి వివరాలు సేకరించినట్లు తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థను గ్రెయిన్ ఏటీఎంగా మార్చడానికి తగిన సాంకేతికత సత్తాను గోదాము, రేషన్‌షాపులకు అనుసంధానం చేయడానికి గల పరిస్థితుల అనుకూలతను పరిశీలించినట్లు ఆయన వివరించారు. అనుకూలత ఉంటే ఈ నెలాఖరు వరకు ఆమనగల్లు గోదాముతో పాటు రేషన్‌షాపులను అన్నపూర్తి పథకానికి అనుసంధానం చేస్తామని స్పష్టం చేశారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

తుక్కుగూడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని రావిర్యాలలో గురువారం నిర్వహించిన 'స్వచ్ఛదనం– పచ్చదనం' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీజనల్ వ్యాధులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇళ్ల మధ్య చెత్త చెదారం, మురుగు నీరు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. విద్యార్థుల భోజనం విషయంలో నాణ్యత పాటించాలని ఆదేశించారు. అనంతరం డీఆర్‌సీ సెంటర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కె.మధుమోహన్, కమిషనర్ బి.వెంకట్రామ్, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని జయప్రదం చేయండి



ఎల్మినేడు నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న శ్రీలత

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వనమహోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత పిలుపునిచ్చారు. మండలంలోని ఎల్మినేడు గ్రామంలో గురువారం ఆమె పర్యటించారు. కమ్యూనిటీ ప్లాంటేషన్ పనులు, పంచాయతీ, అటవీశాఖ నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వనమహోత్సవంలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రతి పంచాయతీ పరిధిలో వెయ్యి మొక్కలు నాటే లక్ష్యంతో పని చేయాలన్నారు. అన్ని రకాల మొక్కలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, విస్తృతంగా నాటేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎక్కడ ఇబ్బందులు ఎదురైనా పంచాయతీ కార్యదర్శులదే బాధ్యత అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీడీ సక్రియా నాయక్, ఏపీఓ తిరుపతాచారి, పంచాయతీ కార్యదర్శి రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ దాసు తదితరులు పాల్గొన్నారు.

కోటలో పంద్రాగస్టు రిహార్సల్స్



గోల్కొండ: పంద్రాగస్టు వేడుకలకు గోల్కొండ కోట సిద్ధమవుతోంది. కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగరవేయనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం పోలీసులు బ్యాండ్ రిహార్సల్స్‌తో పాటు పరేడ్ ప్రాక్టీస్ చేశారు. గోల్కొండ కోట మెయిన్ గేటు ఆనుకుని ఉన్న గ్రీన్ గ్రౌండ్‌లో రిహార్సల్స్ కొనసాగుతున్నాయి.

పర్యవేక్షణ కరువై..

పరిశ్రమలకు వరమై..

- అనుమతులు లేకుండా ఏర్పాటు
- పట్టించుకోని అధికారులు
- ప్రభుత్వ ఆదాయానికి గండి



పరిశ్రమ కోసం పూర్తిస్థాయి అనుమతులు పొందకుండా కొత్తూరులో నిర్మించిన షెడ్డు

కొత్తూరు: అధికారుల పర్యవేక్షణ కొరవడుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. సరైన అనుమతులు పొందకుండానే కొందరు వ్యాపారులు ఇష్టారీతిన పరిశ్రమలను ప్రారంభిస్తున్నారు. ఏవైనా ప్రమాదాలు.. ఇతర సంఘటనలు చోటు చేసుకునే వరకు ఇలాంటి పరిశ్రమలు స్థానికంగా కొనసాగుతున్నాయనే విషయం స్థానిక, ఉన్నతాధికారులకు తెలియడం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కొత్త పరిశ్రమల ఏర్పాటుతో ప్రభుత్వ ఖజానాకు ఆయా పన్నుల రూపంలో చేరాల్సిన ఆదాయం రావడం లేదు. కొత్తగా పరిశ్రమలు, గోదాములు ఏర్పాటు చేసే వ్యాపారులు అధికారులను 'మేనేజ్' చేస్తుండడంతో వారు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. షాద్‌నగర్ నియోజకవర్గంలో 313 పరిశ్రమలు కొనసాగుతుండగా మరికొన్ని నిర్మాణంలో ఉన్నట్లు పరిశ్రమల శాఖ లెక్కలు చెబుతున్నాయి.

అక్కడ వద్దంటే.. ఇక్కడికి..

హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో భాగంగా పట్టణం సమీపంలో కొనసాగుతున్న కాలుష్య కారక పరిశ్రమలను అక్కడి నుంచి తరలించాలని అధికారులు ఇప్పటికే నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. దీంతో చిన్న, మధ్య తరహా పరిశ్రమల నిర్వాహకులు నగర శివారులోని కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్ ప్రాంతాల వైపు దృష్టి సారిస్తున్నారు. రెండు నుంచి పదెకరాల వరకు వ్యవసాయ భూములను కొనుగోలు చేస్తూ పరిశ్రమలు నెలకొల్పుతున్నారు.

అనుమతులు అంతంతే..

- కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే వారు తాము కొనుగోలు చేసిన వ్యవసాయ భూములను ప్రభుత్వానికి నిర్ణీత పన్నులు చెల్లించి వ్యవసాయేతర భూమిగా మార్చుకోవాలి. అయితే పదెకరాలు కొనుగోలు చేస్తే రెండు, మూడెకరాలు మాత్రమే వ్యవసాయేతర భూమిగా మార్చుకుంటున్నారు.
- పరిశ్రమల ఏర్పాటుకు హెచ్ఎండీఏ, గ్రామ పంచాయతీతో పాటు అన్ని శాఖల నుంచి అనుమతి పొందాలి. ఇక్కడ మాత్రం పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం పొందేందుకు వీలుగా మాత్రమే అనుమతులు పొందుతున్నారు.
- పరిశ్రమల నిర్మాణాలకు సంబంధించిన పత్రాలను పంచాయతీకి అందిస్తే వారు ఆ నిర్మాణాల ఆధారంగా ఏటా పన్నులు వసూలు చేస్తారు. నిర్వాహకులు పూర్తిస్థాయి నిర్మాణ పత్రాలు ఇవ్వడం లేదు. దీంతో పన్నులు తక్కువగా వసూలయ్యే అవకాశం ఉంది.
- అప్పటికే కొనసాగుతున్న పరిశ్రమల్లో తదుపరి అవసరాల కోసం కొత్తగా చేపట్టే నిర్మాణాలకు అనుమతులు తీసుకోవడంలోనూ నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.
- షాద్‌నగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కొత్తగా ఏర్పాటవుతున్న పరిశ్రమలు తాము టీఎస్ ఐపాస్‌లో దరఖాస్తు చేసుకున్నాం.. అన్ని అనుమతులు ఉన్నాయని ప్రకటిస్తున్నప్పటికీ గేటు బయట పరిశ్రమల పేర్లను మాత్రం నమోదు చేయడం లేదు.

నిర్లక్ష్య వైఖరి

ప్రభుత్వ అనుమతులు లేకుండా చిన్న షెడ్డును నిర్మించిన వారిపై చర్యలు తీసుకునే సంబంధిత శాఖ అధికారులు ఏకంగా పరిశ్రమలను స్థాపించి అక్రమంగా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్తూరు మున్సిపాలిటీ, మండలంలో కొత్తగా నిర్మిస్తున్న గోదాములు, పరిశ్రమలు, అప్పటికే కొనసాగుతున్న వాటి వివరాలు తెలిసినప్పటికీ చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చట్ట ప్రకారం చర్యలు



మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు అని తేలితే చర్యలు తప్పవు. ఇప్పటికే కొన్నిచోట్ల అక్రమ నిర్మాణాలు చేపట్టిన సదరు యజమానులకు నోటీసులు జారీ చేశాం. గడువులోగా స్పందించకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– బాలాజీ, మున్సిపల్ కమిషనర్, కొత్తూరు

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి


షాద్‌నగర్: పాఠశాల ఆవరణలో మొక్కనాటి నీరుపోస్తున్న అధికారులు


నేదునూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ తదితరులు

- 'స్వచ్ఛదనం'లో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వండి
- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

కందుకూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గురువారం మండల పరిధి నేదునూరులో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. మోడల్ స్కూల్‌లో వంట గది, విద్యార్థినుల వసతి గృహాన్ని పరిశీలించారు. తాగునీటి సరఫరా తీరును పర్యవేక్షించారు. కిచెన్ గార్డెన్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రిన్సిపాల్ శ్రీధర్‌కు సూచించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆధునీకరించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. స్వచ్ఛదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరిత, సీడీపీఓ శాంతిశ్రీ, ఎంపీఓ గీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర, ఏఓ లావణ్య, ఏపీఓ రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, టీఏ రవి, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మలమూత్ర విసర్జన తర్వాత..

షాద్‌నగర్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను విధిగా పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. స్వచ్ఛదనం.. పచ్చదనంలో భాగంగా ఫరూఖ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థినులు విధిగా వారంలో మూడు సార్లు తలస్నానం చేయాలని సూచించారు. చేతి వేలి గోర్లు ఎప్పటికప్పుడు కత్తరించుకోవాలని, నిత్యం ఉదయం, సాయంత్రం బ్రెష్ చేసుకోవాలని చెప్పారు. మలమూత్ర విసర్జన తర్వాత సబ్బుతో చేతులు కడుక్కోవాలని, ఉతికిన దుస్తులు మాత్రమే వేసుకోవాలని, వేడి ఆహారాన్ని తినాలని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ వెంకన్న, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, కౌన్సిలర్ చంద్రకళ, డాక్టర్ నాగేంద్రబాబు, హెచ్‌ఎం శైలజ, శంకర్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

హార్డ్‌వేర్ దుకాణంలో చోరీ

శంకర్‌పల్లి: హార్డ్‌వేర్ దుకాణంలో చోరీ జరిగిన సంఘటన బుధవారం అర్ధరాత్రి శంకర్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శివమ్ ప్లైవుడ్ హార్డ్‌వేర్ దుకాణాన్ని సురేష్ అనే వ్యక్తి నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే దుకాణాన్ని మూసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం షాపు తెరిచేందుకు రాగా.. షట్టర్ తెరిచి ఉంది. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా.. కౌంటర్‌లో ఉన్న రూ.30 వేల నగదు చోరీకి గురయినట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ట్రా'ఫికర్'


మొయినాబాద్ ప్రధాన కూడలిలో సిగ్నల్ వ్యవస్థ

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

- అలంకారప్రాయంగా సిగ్నల్ వ్యవస్థ
- సమస్య పట్టని ట్రాఫిక్ పోలీసులు

మొయినాబాద్: పెరుగుతున్న వాహనాల సంఖ్యతో పాటు.. ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయి. దానికి తోడు ఇష్టారీతిన హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాల నిలుపుదలతో ఇక్కట్లు అధికమవుతున్నాయి. ఇక ప్రధాన చౌరస్తాలో వెహికిల్స్ ఎటు నుంచి ఎటు వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి. సిగ్నల్ వ్యవస్థ ఉన్నప్పటికీ.. ఆ నిబంధనలు ఎవరూ పట్టించుకోవడం లేదు. నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు ఉన్నా.. వారు చొరవ చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

రోడ్డుపై కూలీల నిరీక్షణ

మహానగరానికి చేరువలో.. బీజాపూర్ హైవేలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మొయినాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలు తీవ్రమయ్యాయి. రహదారికి ఇరువైపున ఉన్న దుకాణ సముదాయాలు, బ్యాంకుల ఎదుట ఇష్టంగా వాహనాలు పార్కు చేస్తున్నారు. దీంతో రహదారిపై వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన కూడలిలో ఉదయం వేళలో వందల మంది అడ్డా కూలీలు రోడ్డుపైనే నిరీక్షిస్తుండంతో ఇదీ ఒకింత కారణం అవుతోంది. తద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయి.


బస్టాపులో ఆటోలు పార్కు చేయడంతో రోడ్డుపై నిలిచిన ఆర్టీసీ బస్సు

బస్టాపుల్లో పార్కింగ్

బస్టాపుల్లో ఆటోలు నిలుపుతుండడంతో బస్సులు రోడ్డుపైనే ఆగుతున్నాయి. దీంతో ప్రయాణికులతో పాటు వెనుక వచ్చే వాహన దారులు.. బస్సుల వెనకాలే ఉండటంతో అది కదిలే వరకు ట్రాఫిక్ నిలిచి పోతుంది. దీనికి తోడు రోడ్డు పక్కనే చిరువ్యాపారుల తోపుడు బండ్లతో ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది.

జరిమానాకే పరిమితం

ట్రాఫిక్ కష్టాలు తీర్చడం కోసం ప్రధాన కూడలిలో సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ సిగ్నళ్లను ఎవరూ పట్టించుకోకుండా ఇష్టానుసారం దూసుకెళ్తున్నారు. కానిస్టేబుళ్లు ఉన్నా.. రూల్స్ పాటించని వాహనాలను నిలువరించండం మానేసి.. ఫొటోలు తీసి జరిమానా విధిస్తున్నారు. కానీ.. సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

> **పరిష్కరిస్తాం**
>
> మొయినాబాద్‌లో ట్రాఫిక్ సమస్య పెరిగింది. సిగ్నల్ వ్యవస్థను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తాం. ఇష్టానుసారం వాహనాలు పార్కింగ్ చేసినవారిపై చర్యలు తీసుకుంటాం. తోపుడు బండ్లతో ట్రాఫిక్ ఇక్కట్లు ఏర్పడితే వాటిని తొలగిస్తాం.
>
> – కిరణ్, ట్రాఫిక్ సీఐ, రాజేంద్రనగర్

లడ్డూ నగదు అందజేత

కడ్తాల్: మండల పరిధి మైసిగండి గ్రామంలో గత ఏడాది గణేశుడి చేతిలోని లడ్డూకు వేలం పాట నిర్వహించగా.. రూ.5.01 లక్షలకు మైసిగండి మాజీ సర్పంచ్ తులసీరాం నాయక్ దక్కించుకున్నాడు. సదరు నగదును గురువారం మైసిగండిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు హీరాసింగ్‌కు, తులసీరాం నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు.. నాయక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జవహర్‌లాల్, రమేశ్, రాందాస్‌నాయక్, రవి, రాము, తులసీరాం, యాదగిరి ఉన్నారు.

అర్ధాకలితో అలమటిస్తున్న కార్మికులు

- పెండింగ్ వేతనాలు చెల్లించి ఆదుకోండి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: రెక్కాడితే కాని డొక్కాడని కార్మికులతో పనిచేయించుకుంటూ.. 8 నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదని, తద్వారా కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతూ.. అర్ధాకలితో అలమటిస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. వెంటనే వారికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికులు ఫరూఖ్‌నగర్ ఎంపీడీఓ బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీసం వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని, ప్రమాద బీమా కల్పించాలని కోరారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులు మరణిస్తే తక్షణ సహాయం కింద రూ.30వేలు ఇవ్వాలన్నారు. కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్‌గౌడ్, రాజశేఖర్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు సరిత, జంగయ్య, పాండు నాయక్, పుష్పమ్మ, యాదమ్మ, పాండురంగం, నర్సమ్మ, బాలమణి, మైసమ్మ, జంగమ్మ, పార్వతమ్మ, శ్యామలమ్మ, మంగమ్మ, నర్సింలు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీఓకు వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు, కార్మికులు

రైతులకు ఇచ్చిన మాట నిలుపుకోండి

కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

కేశంపేట: రైతులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధి కొత్తపేట గ్రామంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో రైతు రచ్చబండను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాటను నిలుపుకోకుండా.. షరతులు విధిస్తూ కాలయాపన చేస్తుందని విమర్శించారు. బేషరతుగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు కోరారు. పుష్కర కాలంగా కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, అయినా దానినే ప్రామాణికంగా తీసుకుని రుణమాఫీకి లింక్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులతో పాటు కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇప్పటి వరకు రైతులకు పూర్తి స్థాయిలో రైతుబంధు వేయలేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. రచ్చబండ కార్యక్రమం అత్యధికంగా పార్టీ శ్రేణులతో కొనసాగడం గమనార్హం. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్యలు, మండల అధ్యక్షుడు రఘురాంగౌడ్, భైపాలచారి, మధుసూదన్ గౌడ్, వెంకటేశ్ గౌడ్, నరసింహ్మారెడ్డి, మోటే శ్రీను, నరసింహ, ఐలయ్య, విఠల్‌గౌడ్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

విద్యార్థుల బాహాబాహీ

కుషాయిగూడ: విద్యాబుద్ధులు నేర్చుకునేందుకు కళాశాలలకు వస్తున్న విద్యార్థులు చిన్న, చిన్న గొడవలకే గ్యాంగులుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారు. తాజాగా గురువారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోని ఈసీఐఎల్ బస్ టెర్మినల్ ఎదురుగా ఉన్న వీధిలో విద్యార్థులు బాహాబాహీకి తలపడ్డారు. ఒకరినొకరు దూషించుకుంటూ పిడిగుద్దులతో దాడులు చేసుకున్నారు. విద్యార్థుల ఫైటింగ్ సీన్ సినిమాను తలపించేలా ఉండటంతో అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు. ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ పరిసరాల్లో నిత్యం ఇలాంటి గొడవలు చోటు చేసుకుంటున్నాయంటూ ఇదివరకే 'సాక్షి' కథనాలు ప్రచురించినా పోలీసులుగానీ, కళాశాలల యాజమాన్యాలుగానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా విద్యార్థులకు కౌన్సెలింగ్‌తో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతాల్లో పోలీసు పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై శుక్రవారం పలువురు కార్పొరేటర్లు అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. పీర్జాదిగూడలో మొత్తం 26 మంది కార్పొరేటర్లు. వీరిలో కాంగ్రెస్ పార్టీ పక్షాన 22 మంది ఉన్నారు. వారు గత నెలలో మేయర్‌పై అవిశ్వాస తీర్మాన నోటీసును కలెక్టర్‌కు ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసి ప్రొసీడింగ్ ఆఫీసర్‌గా కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డిని నియమించారు. మరోవైపు అవిశ్వాసం తీర్మానాన్ని నిలుపుదల చేయాలంటూ మేయర్ వెంకట్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, దానిని కోర్టు డిస్మిస్ చేసింది.

భూత వైద్యులను నమ్మొద్దు


పీహెచ్‌సీ ఆవరణలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులు

శంకర్‌పల్లి: భూత వైద్యం చేస్తామంటూ వచ్చేవారిని నమ్మొద్దని గద్వాల జిల్లా నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతమ్మ అన్నారు. గురువారం ఆ కళాశాల బీఎస్సీ విద్యార్థినులతో కలిసి ఆమె శంకర్‌పల్లి పీహెచ్‌సీని సందర్శించారు. అనంతరం విద్యార్థులు భూత వైద్యంపై నాటకాన్ని ప్రదర్శించి, రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల ప్రజలు మూఢ నమ్మకాలను ఇప్పటికైనా వీడనాడాలని, వారు చెప్పే మాయమాటలను నమ్మరాదని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు రేవతిరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ దీపిక, హెల్త్ అసిస్టెంట్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ బుకింగే ఆమెకు శాపమైంది!

సాక్షి, సిటీబ్యూరో: బైక్ ట్యాక్సీ బుకింగ్‌లో చేసిన చిన్న పొరపాటు ఓ యువతికి శాపమైంది. ఐదేళ్లుగా మానసిక వేధింపులకు కారణమైంది. సోషల్ మీడియాలో సదరు బైక్ ట్యాక్సీ డ్రైవర్ వేధింపులకు గురి చేస్తుండటంతో తాళలేక తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఢిల్లీకి చెందిన ఓ యువతి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. 2019లో నగరానికి వచ్చినప్పుడు యాప్ ద్వారా బైక్ ట్యాక్సీ బుక్ చేసుకుంది. బైక్ ట్యాక్సీ డ్రైవర్ తన పేరు రవి అని పరిచయం చేసుకున్నాడు. బైక్ ట్యాక్సీలు, క్యాబ్‌లు సహా ఆన్‌లైన్ సేవలు పొందేటప్పుడు వినియోగదారుల వ్యక్తిగత ఫోన్ నెంబర్ ఆ డ్రైవర్‌కు, సేవలు అందించడానికి వచ్చినవారికి చేరదు. కేవలం కంపెనీ నుంచి వచ్చే వర్చువల్ నెంబర్ ద్వారానే వీరి మధ్య సంప్రదింపులు జరుగుతాయి. ఈ విషయం తెలిసినప్పటికీ సదరు యువతి చిన్న పొరపాటు చేసింది. రైడ్ ముగిసిన తర్వాత కార్యాలయ రికార్డుల కోసమంటూ రవికి సదరు యువతి తన ఫోన్ నెంబర్ ఇచ్చింది. బైక్ దిగిన కొద్దిసేపటికే ఆమెకు రవి నుంచి రెండు సందేశాలు రాగా ఆమె పట్టించుకోలేదు. కొన్ని రోజులకు రవి తన సోషల్‌మీడియా ఖాతా ద్వారా ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపగా ఆమె అంగీకరించింది. ఇక అప్పటి నుంచి రకరకాలైన సందేశాలను ఆమెకు పంపడం మొదలెట్టాడు. దీంతో విసిగిపోయిన యువతి అతడి ఫోన్ నెంబర్‌తోపాటు సోషల్‌మీడియా ఖాతాను బ్లాక్ చేసింది. రవి వ్యవహారాన్ని అతడు పనిచేస్తున్న కంపెనీకి ఈ–మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసింది. అయినా అతడి వేధింపులు ఆగలేదు.

ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు

ఆ యువతిని మరింత వేధించేందుకు రవి పలు నకిలీ పేర్లతో ఇన్‌స్టాగామ్‌లో ఖాతాలు తెరిచాడు. యువతి ఖాతా నుంచి ఆమె ఫొటోలు సంగ్రహించి మార్ఫింగ్ చేసి, అభ్యంతరకర, అశ్లీల సందేశాలూ పంపాడు. దాదాపు ఐదేళ్లుగా ఈ వేధింపులు భరించిన బాధితురాలు ఎట్టకేలకు ఈ నెల 3న ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీని దర్యాప్తు కోసం రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం సాంకేతిక ఆధారాలను బట్టి నిందితుడు హైదరాబాద్‌లోనే ఉన్నట్లు గుర్తించింది. ఢిల్లీలో ఉన్న పోలీసులు ఇంటర్‌నెట్ ప్రొటోకాల్ డిటెయిల్డ్ రికార్డు(ఐపీడీఆర్) సహా ఇతర వివరాలు సంగ్రహిస్తోంది. మరో బృందం హైదరాబాద్ చేరుకుని, రవిని వేటాడే పనిలో పడింది. అతడు గతంలో పని చేసిన కంపెనీని సంప్రదించింది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ మృతి

చేవెళ్ల: ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలం రేగడిఘనాపూర్ గ్రామానికి చెందిన కండ్లపల్లి చంద్రయ్య(65) వ్యవసాయకూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో.. చంద్రయ్య ఈ నెల 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు బాధితున్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వికారాబాద్ జిల్లాలోని మిషన్ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ చంద్రయ్య గురువారం చనిపోయాడు. మృతుడి కొడుకు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీఎంతో షాద్‌నగర్‌వాసి


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో శ్రీనిజ్‌రెడ్డి

షాద్‌నగర్: పెట్టుబడుల నిమిత్తం అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం షాద్‌నగర్ వాసి చెంది శ్రీనిజ్ రెడ్డి కలిశారు. డల్లాస్‌లో ప్రవాస భారతీయులతో సీఎం సమావేశం కాగా, ఇందులో కాంగ్రెస్ సీనియర్ నేత తిరుపతిరెడ్డి కొడుకు శ్రీనిజ్.. సీఎంతో పాటు మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు.

తల్లీ కూతుళ్ల అదృశ్యం


రాములమ్మ (ఫైల్)


వసంత (ఫైల్)


లక్ష్మి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: తల్లి, ఇద్దరు కూతుళ్లు అదృశ్యమైన ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రావిర్యాల గ్రామానికి చెందిన గువ్వ రాములమ్మ(40) తన ఇద్దరు కూతుర్లు వసంత(16), లక్ష్మి(13)లతో కలిసి ఈ నెల 6వ తేదీ ఉదయం 8 గంటలకు కిరాణ దుకాణానికి వెళ్లొస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. రాత్రి 8 గంటలు దాటినా వారు ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం భర్త కొండలు చుట్టుపక్కల వెతికారు. బంధువుల వద్ద ఆరా తీశారు. ఆచూకీ లభ్యంకాకపోవడంతో కొండల్.. గురువారం ఆదిబట్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాణించిన కెప్టెన్ వంశీకుమార్

సాక్షి, సిటీ బ్యూరో: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏ 2 డివిజన్ రెండురోజుల లీగ్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో మణికుమార్ టీం 267 పరుగుల భారీ తేడాతో విజయాన్ని సొంతం చేసుకుంది. హర్షిత క్రికెట్ గ్రౌండ్ వేదికగా జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో 'మణికుమార్', 'శ్రీ శ్యామ్' జట్లు పోటీ పడ్డాయి. మొదటగా బ్యాటింగ్‌కు దిగిన మణికుమార్ జట్టు 333 పరుగుల భారీ లక్ష్యాన్ని ప్రత్యర్థి జట్టుకు నిర్దేశించింది. ఇందులో బ్యాట్స్‌మన్ వంశీ కుమార్ 176 పరుగులతో అత్యుత్తమ ప్రదర్శన చేశారు. అనంతరం లక్ష్య ఛేదనలో శ్రీ శ్యామ్ జట్టు బ్యాటర్లు కేవలం 66 పరుగులకే ఆలౌటయ్యారు. అయితే బౌలింగ్‌లోనూ రాణించిన వంశీకుమార్ ఆరు ఓవర్లలో 5 వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టును కోలుకోలేని దెబ్బ తీశారు. ఈ లీగ్ చాంపియన్‌షిప్‌లో మణికుమార్ జట్టు కెప్టెన్ వంశీ కుమార్ ఆల్‌రౌండ్ ప్రతిభతో భారీ విజయాన్ని అందుకుంది.

డ్రగ్స్‌ను అంతమొందించాలి

గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్‌ను అంతమొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఆ దిశగా కృషి చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 7, 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమ్మఒడి తొలిబడి అయితే మలి ఒడి మనబడి అని, ఆ బడిలోనే విద్యార్థులకు విలువలు గల విద్యను బోధించాలని సీతక్క సూచించారు. పాఠశాలలకు కూడా డ్రగ్స్ మహమ్మారి పాకుతోందని, దానిని అడ్డుకోవాలని అన్నారు. మన ఆరోగ్యంతోపాటు తల్లిదండ్రుల గౌరవాన్ని కూడా కాపాడాలని పేర్కొన్నారు. ఉత్తమ సమాజ నిర్మాణం బడిలోనే జరుగుతుందని, ఉపాధ్యాయులు ఆ దిశగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. తెలంగాణలో మంచి విద్యావ్యవస్థ ఉందని, దానిని మరింత పటిష్టం చేస్తామన్నారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఈవో రోహిణి, ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, ప్రముఖ విద్యావేత్త ఆకెళ్ల రాఘవేంద్ర, బాలోత్సవం కార్యదర్శి సోమయ్య ఉన్నారు.